క్లుప్తంగా

వరి పనలపై ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి



పాములవాకలో అవగాహన కల్పిస్తున్న ఏవో సరోజిని

కోటవురట్ల: అల్పపీడన ప్రభావంతో తాజాగా కురుస్తున్న వర్షాలకు వరి పనలు తడిస్తే 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని వ్యవసాయ అధికారి బి.సరోజిని సూచించారు. పాములవాకలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా వరి చేలల్లో నీరు నిలిచిపోతే చిన్న కాలువలు తీసి నీటిని బయటకుపోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. అపరాల సాగు కోసం రైతు సేవా కేంద్రాలలో విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. పప్పు ధాన్యాలకు మంచి డిమాండ్ ఉన్నందున రైతులు అపరాల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ నూకరాజు, రైతులు పాల్గొన్నారు.

గంటవానిపాలెంలో జిల్లా వ్యవసాయాధికారి పర్యటన



తడిసిన వరి పనలను పరిశీలిసున్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

మునగపాక: మండలంలోని గంటవానిపాలెంలో మంగళవారం అనకాపల్లి జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన వరి పనలను ఆయన పరిశీలించారు. వాతావరణం అనుకూలంగా లేనందున రైతులు వరికోతలు చేయవద్దన్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, వీఏ ఈ.మాధవి, రైతులు పాల్గొన్నారు.

తక్షణం వరి కుప్పలు పెట్టాలి



పాల్మన్‌పేటలో వరి కుప్పలను పరిశీలిస్తున్న ఏవో ఆదినారాయణ

పాయకరావుపేట: వరి పంటను కోసిన రైతులు పనలు ఆరిన వెంటనే కుప్పలు పెట్టుకోవాలని వ్యవసాయ శాఖ మండల అధికారి పి.ఆదినారాయణ సూచించారు. మండలంలోని పాల్మన్‌పేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. తుపాను కారణంగా రైతులు వరి కోతలను రెండు రోజుల పాటు వాయిదా వేసుకోవాలన్నారు. కోసిన వరి పనలను తడి ఆరే వరకు జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. కుప్పలు తవడకుండా టార్పాలిన్లతో కప్పాలని సూచించారు.

ఆదర్శవంతంగా తోటాడ పంచాయతీ



చెత్త తొలగింపు పనులు పరిశీలిస్తున్న దొడ్డి కోటేశ్వరరావు

మునగపాక: తోటాడ పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని, ఇందుకు ప్రజలంతా సహకరించాలని వైఎస్సార్‌సీపీ నేత దొడ్డి కోటేశ్వరరావు కోరారు. మండలంలోని తోటాడ శివారు గవర్ల అనకాపల్లిలో మంగళవారం చెత్త తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటాడ పంచాయతీకి అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మత్స్యకారులపై తుపాను ప్రభావం

ఎస్.రాయవరం: తుపాను ప్రభావంతో మండలంలో చలిగాలులు వీస్తున్నాయి. అడపాదడపా వర్షాలు కురిసి, రోజంతా కారుమబ్బులతో వాతావరణం నెలకొంది. రేవుపోలవరం, బంగారమ్మపాలెం మత్స్యకారులు చేపలు వేట నిలిపివేశారు. వరుస తుపానులు కారణంగా చేపల వేట లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మునగపాకలో ఆధ్యాత్మిక సిరులు



మునగపాక గౌరీ పరమేశ్వరుల ఆలయంలో భజనలు చేస్తున్న కమిటీ సభ్యులు

దశాబ్దాలుగా కొనసాగుతున్న మేలుకొలుపు

పిల్లలు, పెద్దలు బృందంగా భజనలు

ఆదర్శంగా నిలుస్తున్న మునగపాక పల్లపు వీధి వినాయక కమిటీ

మునగపాక: ఈ గ్రామం ఉద్యమాలకే కాదు.. ప్రజల్లో భక్తిభావాలను పెంచడంలో ముందుంటుంది. ఇక్కడి ప్రజలు ఏ కార్యక్రమం తలపెట్టినా అంకితభావంతో పనిచేయడం వారి చిత్తశుద్ధికి నిదర్శనం. పిల్లల నుంచి యువకులు, పెద్దలు తాము తలపెట్టిన కార్యక్రమం విజయవంతం చేయడంలో ముందుంటారు. ఆ గ్రామం పేరే మునగపాక. ఇక్కడి ప్రజలు ఎంతో చైతన్యవంతులు. ఏ సమస్య వచ్చినా అందరూ కులమతాలకు అతీతంగా పరిష్కరించుకుంటారు.

మేలుకొలుపుతో భక్తిభావాలు

ప్రతి రోజు ప్రజలు ఏదో పనిపై వెళ్లడం.. ఉదయం నుంచి సాయంత్రం వరకు పనిచేసి అలసిపోవడం .. తీరా ఇంటికి వచ్చాక సెల్‌ఫోన్ లేదా టీవీలను చూసి నిద్రలోకి జారుకోవడం ఇది మనిషి జీవన విధానంలో భాగం. అయితే సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ హిందూ ధర్మం పరిరక్షణ కోసం పాటుపడేలా పలు చోట్ల ప్రజలు భక్తిభావాలను పెంచుకుంటున్నారు. ప్రజలు ఆరోగ్యవంతంగానూ, అలాగే ఉత్సాహవంతంగానూ ఉండేందుకు అనాధిగా వస్తున్న మేలు కొలుపు మంచి ఫలితాలు ఇస్తుంది.

ఆదర్శంగా మునగపాక వినాయక కమిటీ

ధనుర్మాసం వచ్చిందంటే చాలు మునగపాక పల్లపు వీధి వినాయక ఆలయ కమిటీ సభ్యుల భక్తి భావాలు ఈ ప్రాంత ప్రజలకు గుర్తుకు వస్తుంది. ఇక్కడి యువకులు మేలుకొలుపునకు ప్రాధాన్యత ఇస్తారు. నెల రోజుల పాటు మేలు కొలుపుల కార్యక్రమం నిర్వహించడం అనాధిగా వస్తోంది. 1952 నుంచి అప్పటి పెద్దలు శివకోటి సాంబశివరాజు, తదితర పది మందితో కలిసి మేలుకొలుపునకు శ్రీకారం చుట్టారు. క్రమేణా 72కు పైగా పిల్లలు, యువకులు, పెద్దలు మేలుకొలుపులో భాగమయ్యారు. ప్రతి రోజు తెల్లవారుజామున 4.30 గంటలకు భక్తులంతా చన్నీటి స్నానమాచరించి శివపార్వతుల చిత్రపటంతో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహిస్తున్నారు. పల్లపు వీధి వినాయక గుడి నుంచి ప్రారంభమయ్యే మేలు కొలుపుల కార్యక్రమం సాంబశివుని ఆలయం, సంతబయిల వినాయక ఆలయం, రామాలయం, పంచాయతీ వీధిలోని రామాలయం, గౌరీ పరమేశ్వరుల ఆలయం, నందీశ్వర ఆలయం అలాగే సాయిబాబా ఆలయం, మెయిన్‌రోడ్డులోని లింగరాయి గుడి, అభయాంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు భజనలు చేసుకుంటూ దేవతామూర్తులను నిద్రలేపుతారు. చివరిలో పల్లపువీధి వినాయక దేవాలయం వద్ద అల్పాహారం తీసుకొని ఆ రోజు ముగిస్తారు. నెలరోజుల పాటు నిర్వహించే మేలు కొలుపులో భాగంగా భోగి రోజున ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన కార్యక్రమంతో మేలుకొలుపు ఘనంగా ముగుస్తుంది.



మునగపాకలో శివపార్వతుల ఫొటోతో ఊరేగింపు చేస్తున్న భక్తులు

అందరిలో ఆధ్యాత్మికత ఉండాలి



ప్రతి ఏడాది మేలుకొలుపు కార్యక్రమంలో పాల్గొంటాను. పెద్దలు ఎంతో ఆశయంతో ప్రారంభించిన మేలు కొలుపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నాం. గ్రామం సస్యశ్యామలంగా, ఆధ్యాత్మికతతో ఉండేందుకు ఈ మేలుకొలుపుల కార్యక్రమం దోహదపడుతుంది. ప్రతి ఒక్కరూ అవకాశం ఉన్నంతలో దైవ భక్తి చాటుకోవాలి.

– సూరిశెట్టి అప్పలనాయుడు, మేలుకొలుపు సంఘం అధ్యక్షుడు, మునగపాక

ఆరోగ్యవంతమైన జీవనానికి ఆస్కారం



మేలుకొలుపుల కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా ఆరోగ్యవంతంగానూ అలాగే ఉత్సాహంగా ఉండగలుగుతున్నాం. ప్రతి రోజూ తెల్లవారు నిద్రలేచి చన్నీటిస్నాన మాచరించి భజనలు చేస్తూ దేవతా మూర్తులను మేల్కొలపడం సంప్రదాయంగా వస్తుంది. మేలుకొలుపులో పాల్గొనడం ద్వారా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా ఉండవచ్చు.

– వేగి నరేష్, భక్తుడు, మునగపాక

నేత్రపర్వంగా ధనుర్మాసోత్సవాలు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు నేత్ర పర్వంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. కొండ దిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామి సన్నిధి, ఉత్సవమూర్తులు, గోదాదేవి సన్నిధి, ఉపాలయాల్లో నిత్య పూజలు నిర్వహించిన అనంతరం అర్చక బృందం శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామిని హంస వాహనంపైన, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి మూలవిరాట్ సన్నిధిలో తొమ్మిదో పాశురాన్ని విన్నపం చేశారు. అమ్మవారికి ప్రత్యేక నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.



హంస వాహనంపై స్వామికి తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

'అభిజిత్' మహిళా కార్మికులకు బకాయిలు చెల్లించాలి

అచ్యుతాపురం: అభిజిత్ లేఆఫ్ ఒప్పందం కార్మికులందరికీ అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అచ్యుతాపురంలో తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, మండల కన్వీనర్ కె.సోమునాయుడు మాట్లాడుతూ గత అక్టోబర్ 13న లే ఆఫ్ ప్రకటించిన అభిజిత్ కంపెనీ కార్మికులకు బోనస్, బకాయిలు చెల్లించేందుకు అంగీకరించిందని తెలిపారు. ఆ ఒప్పందం మేరకు మెటల్ కొట్టే మహిళా కార్మికులకు మాత్రం ఎటువంటి బకాయిలు చెల్లించలేదన్నారు. లే ఆఫ్ మేరకు మహిళా కార్మికుల కచ్చితంగా బకాయిలు ఇవ్వాలని, లేకుంటే భారీ ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కామేశ్వరి, రాజాన అమ్మాజీ, సూరంపూడి తలుపులమ్మ, రాజాన చిన్నమ్మ, లాలం లక్ష్మి, రెడ్డి నూకరత్నం, కారుకొండ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



అచ్యుతాపురం తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

కోటవురట్ల: రెవెన్యూ సదస్సులతో భూసమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని తహసీల్దారు తిరుమలబాబు అన్నారు. రాజుపేట శివారు పి.రామన్నపాలెంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించి భూ సమస్యలపై అవగాహన కల్పించారు. తహసీల్దారు తిరుమలబాబు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులకు మంచి స్పందన వస్తోందన్నారు. రెవెన్యూ సదస్సుల్లో ఎక్కువగా పట్టాదారు పాసు పుస్తకాలు, ఆన్‌లైన్, రీ సర్వే వంటి సమస్యలపై అర్జీలు వస్తున్నట్టు తెలిపారు. ఇక్కడ 2 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.వెంకటరమణ, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాక: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. మండలంలోని నాగులాపల్లిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయన్నారు. గతంలో రీ-సర్వేలో జరిగిన లోపాలను సవరించడంతో పాటు రైతులకు మేలు జరుగుతుందన్నారు. సర్పంచ్ జామి చినమ్మలు, రీ-సర్వే డీటీ పడాల్, పలువురు రైతులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: జేవీపాలెం గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు పలు రకాల భూసమస్యలపై సుమారు 18 దరఖాస్తులు సమర్పించారని తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. పట్టాలిచ్చి ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని పలువురు లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ మూర్తి, వీఆర్వో శ్రీధర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రామన్నపాలెం రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు, రైతులు

ఉత్సాహంగా మేలుకొలుపులు

మునగపాక: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో మేలుకొలుపుల కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ధనుర్మాసంలో భాగంగా గ్రామాల్లో భక్తులు మేలుకొలుపుల కార్యక్రమంలో పాల్గొని దేవతామూర్తులను భజనలు చేస్తూ నిద్రలేపుతున్నారు. వచ్చే నెల భోగి పండగ వరకు మేలుకొలుపులను నిర్వహించనున్నారు. శివ పార్వతుల చిత్రపటాలతో పిల్లలు, పెద్దలు, యువకులు ఊరేగింపు చేపడుతున్నారు.



మూలపేటలో మేలుకొలుపులో భక్తులు

వేట విరామ పరిహారం కోసం మత్స్యకారుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మత్స్యకార నాయకులు

రాంబిల్లి(యలమంచిలి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా మత్స్యకారులకు వేట విరామ పరిహారం నేటికీ అందజేయలేదని, తక్షణం పరిహారం అందించి ఆదుకోవాలని రాంబిల్లి మత్స్యకార సంఘం నాయకులు చింతకాయల శివాజీ, చోడిపిల్లి గంగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం రాంబిల్లి మండలంలో మత్స్యకారులకు మత్స్యకార భరోసా అందడంలో జాప్యంపై వాడపాలెం గ్రామంలో ఆందోళన చేశారు. అనంతరం మత్స్యకారుల సమస్యలపై రాంబిల్లి డిప్యూటీ తహసీల్దారు వెంకట్‌కు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు ప్రతి సంవత్సరం విధిగా మత్స్యకార భరోసా అకౌంట్‌లో జమ అయ్యేదని గుర్తు చేశారు. సకాలంలో సాయం అందక మత్స్యకారులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సంఘం నాయకులు గరికిన అప్పలరాజు, సిహెచ్.పోతురాజు, ఎస్.ముసిలిరావు, చోడిపిల్లి అప్పలరాజు, వెంకటేష్, సత్తిబాబు, సిహెచ్.జగ్గా, జి.నూకరాజు, పాల్గొన్నారు.

బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



అంగన్‌వాడీ, ఉపాధ్యాయులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో జయమాధిరి, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి అనంతలక్ష్మి

రాంబిల్లి(యలమంచిలి): బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాంబిల్లి ఎంపీడీవో జయమాధురి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ ప్రాజెక్ట్ డైరెక్టర్ అనంతలక్ష్మి, సీడీపీవో ఇందిరాదేవి కోరారు. రాంబిల్లి మండలంలో పంచదార్ల గ్రామంలోని తుపాను షెల్టర్‌లో మంగళవారం కిశోరి బాలికా వికాసంపై మండలంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, పోలీసులు, వివిధ శాఖల సిబ్బందికి శిక్షణా తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలల హక్కులు, బాలికల సంరక్షణ, బాల్య వివాహాలు, అఘాయిత్యాలు, లైంగిక వేధింపులు, దాడులను ఏవిధంగా ఎదుర్కోవాలో పాఠశాలల్లో, గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. అప్పుడే కిశోరి బాలిక వికాసం లక్ష్యం నెరవేరుతుందన్నారు. అంతకు ముందు కిశోరి వికాసంపై పోస్టర్ ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేశారు. మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దిమిలి వైద్యాధికారి వెంకటేష్, ఈవోపీఆర్‌డీ సన్యాసిరాజు, ఎంఈవో సూర్యారావు, జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధి డి.లోవరాజు, రాంబిల్లి హెచ్‌ఎం వేణుగోపాల్, సూపర్‌వైజర్‌లు బీబీ మాలతి, రాణీ పైడికొండ, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.


సందడిగా ఫ్రెషర్స్‌డే వేడుకలు

యలమంచిలి రూరల్: పట్టణంలోని గీతాంజలి కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలు మంగళవారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ఆటపాటలతో కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బండారి కరుణ, కటారి పద్మ, నవీన్, శెట్టి జాహ్నవి, బషీరా బేగం, ఆషియా, బొద్దపు సాయి దుర్గా ప్రసాద్, ప్రత్యూష పాల్గొన్నారు.



డాన్స్ చేస్తున్న విద్యార్థినులు

చర్చిలకు క్రిస్మస్ శోభ



దేవవరంలో 112 సంవత్సరాల చరిత్ర కలిగిన చర్చి



మునగపాక మెయిన్‌రోడ్డులోని చర్చి



వేడుకలకు సిద్ధమైన కోటవురట్లలోని చర్చి



కొరుప్రోలులో ముస్తాబైన చర్చి



విద్యుద్దీపాలతో కాంతులీనుతున్న యలమంచిలి ఆంధ్ర సెంటినరీ బాప్టిస్టు చర్చి

నక్కపల్లి: క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. బుధవారం జరిగే వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వారం రోజుల ముందు నుంచే ప్రత్యేక ప్రార్థన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళల క్రిస్మస్, యూత్ క్రిస్మస్, పిల్లలు, వృద్ధుల క్రిస్మస్ అంటూ రోజుకొక కార్యక్రమాలతో ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. నక్కపల్లి, ఉద్దండపురం, దేవవరం, గొడిచర్ల, నెల్లిపూడి, గునిపూడి, చినదొడ్డిగల్లు, చినతీనార్ల, జగన్నాథపురం, గుల్లిపాడు, కాగిత, వేంపాడు తదితర గ్రామాల్లో ఉన్న చర్చిలను విద్యుద్దీపాలంకరణతో సర్వాంగ సుందరంగ అలంకరించారు.

దేవవరం చర్చికి 112 ఏళ్ల చరిత్ర

జాతీయ రహదారి పక్కన దేవవరం జంక్షన్‌లో 112 సంవత్సరాలు చరిత్ర ఉన్న పాల్ సెంటినరీ బాప్టిస్ట్ పురాతన చర్చి ఉంది. 1912 సంవత్సరంలో నిర్మించిన ఈ చర్చిని సంఘ కాపరులు, సభ్యులు, పెద్దల సహకారంతో ఆధునికీకరించారు. 100 సంవత్సరాలు పూర్తి కావడంతో సెంటినరీ హోదా లభించింది. క్రిస్మస్‌కు వారం రోజుల ముందు నుంచే చర్చిని విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రస్తుతం ఈ చర్చిలో దేవవరం, నామవరం, గాంధీనామవరం ప్రాంతాలకు చెందిన 500 మంది సభ్యులుగా ఉన్నారు. చర్చి అధ్యక్షుడిగా బి.శోభన్‌బాబు, కార్యదర్శిగా యాదాల దయానంద్, ట్రెజరర్‌గా గొర్ల బాబ్జి వ్యవహరిస్తున్నారు. ఇక స్త్రీల సంఘం అధ్యక్షురాలిగా ఆర్.రత్నం, కార్యదర్శిగా ఆర్.ప్రభావతి, ట్రెజరర్‌గా నూకాలమ్మ వ్యవహరిస్తున్నారు. యూత్ సంఘం తరపున అధ్యక్షుడిగా ఎస్.భరత్ రాజు, కార్యదర్శిగా ఎ.రాజశేఖర్, ట్రెజరర్‌గా వై.యేసుబాబు ఉన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి సంఘ కాపరి రెవ ఎన్.పేతూరు ఆధ్వర్యంలో మెగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువతీ యువకులు, చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మునగపాక: మండల వ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు క్రైస్తవులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పలు చోట్ల చర్చిలను సుందరంగా అలంకరించారు. మునగపాక, నాగులాపల్లి, మెలిపాక, గణపర్తి, టి.సిరసపల్లి, వాడ్రాపల్లి, నాగవరం తదితర ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి.

కోటవురట్ల: మండలంలో క్రిస్మస్ వేడుకలకు చర్చిలు సిద్ధమయ్యాయి. స్టార్స్, విద్యుద్దీపాలంకరణతో చర్చిలు మెరిసిపోతున్నాయి. కోటవురట్లలోని క్రీస్తు కృపాలయ బాప్టిస్టు చర్చి, రాట్నాలపాలెంలోని బెతస్థా ప్రార్థనా మందిరం, ఎల్‌షద్దాయి ఆరాధనా సంఘాల చర్చిల్లో వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

ఎస్.రాయవరం: మండలంలోని పలు గ్రామాల్లో చర్చిలు విద్యుద్దీపాల అలంకరణలో కళకళలాడుతున్నాయి. ఎస్.రాయవరం, కొరుప్రోలు, తిమ్మాపురం, దార్లపూడి, పెదగుమ్ములూరు, వెంకటాపురం తదితర గ్రామాల్లో చర్చిల్లో ప్రత్యేకంగా అలంకరించి క్రిస్మస్ వేడుకలకు సిద్ధం చేశారు.

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణంలో క్రిస్మస్ సందర్భంగా పురాతన ప్రార్థనా మందిరాలను ముస్తాబు చేశారు. సైతారుపేట రోడ్డులో ఉన్న ఆంధ్ర సెంటినరీ బాప్టిస్టు ప్రార్థనా మందిరానికి 119 ఏళ్ల చరిత్ర ఉంది. 1905లో నిర్మించిన ఈ చర్చి నిత్యం క్రీస్తు ఆరాధనలు, భక్తులతోకళకళలాడుతూ ఉంటుంది. స్థానిక బైపాస్ రోడ్డులో ఉన్న రోమన్ కేథలిక్ చర్చి 1931లో నిర్మించారు. సోమలింగపాలెం, పులపర్తి, లింగరాజుపాలెం గ్రామాల్లో చర్చిలు కూడా క్రిస్మస్ వేడుకలకు సిద్ధమయ్యాయి. ప్రస్తుతం యలమంచిలిలో రోమన్ కేథలిక్ ప్రార్థనా మందిరాలను ఫాదర్ లూకాస్ కల్లకట్, బెంజమిన్‌లు పర్యవేక్షిస్తున్నారు. చర్చిల్లో మంగళవారం అర్ధ రాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. అంతటా క్రిస్మస్ సందడి నెలకొంది.



మునగపాకలోని ఓ స్కూల్‌లో మంగళవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో సంప్రదాయ దుస్తుల వేషధారణలో చిన్నారులు